## క్లుప్తంగా

### రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

గండేపల్లి: స్థానిక రామలింగేశ్వరస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జేష్ట బహుళ ద్వాదశిని పురస్కరించుకుని పండితులు స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

### అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం


అగ్ని ప్రమాదబాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

గండేపల్లి: మండలంలోని యల్లమిల్లిలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలను గురువారం ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు పరామర్శించి ఆర్థిక సహాయం, నిత్యావసర వస్తువులను అందజేశారు. అధైర్య పడొద్దని, ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఆయన వెంట తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైస్ ఎంపీపీ కుంచే రాజా, జిల్లా వ్యవసాయ సలహామండలి సభ్యుడు ఒబిణ్ని వీరబాబు, సచివాలయాల మండల కన్వీనర్ తాళ్లూరి మధు తదితరులు ఉన్నారు.

**అగ్నిప్రమాద బాధితులకు చేయూత**

ఏలేశ్వరం: మండలంలోని తిరుమాలిలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఇళ్లు కోల్పోయి నిరాశ్రయులైన బాధితులకు హెల్పింగ్ యూత్ సభ్యులు చేయూతనందించారు. బాధితులు వడ్డి రాజబాబు, దుర్గల కుటుంబ సభ్యులకు హెల్పింగ్ యూత్ ఆధ్వర్యంలో గురువారం వంటసామగ్రి, కిరాణా, బియ్యం అందజేశారు. యూత్ సభ్యులు జి.సుబ్రమణ్యం, పోకల వెంకటేష్, కోరుకొండ సాయిసంజయ్, అంజూరి రాంబాబు, ఎస్కే ఆలీషా, మద్దుల స్వరూప్ పాల్గొన్నారు.

### వచ్చే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీదే విజయం

గండేపల్లి: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధిస్తుందని వైఎస్సార్ సీపీ నాయకుడు తోట నరసింహం అన్నారు. మండలంలోని ఎన్టీ రాజాపురంలో గురువారం తన అభిమానులు ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశంలో ఆయన పాల్గొని పాతజ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివంగత నేత వైఎస్ రాజశేఖర రెడ్డికి, తమ సోదరుడు స్వర్గీయ తోట వెంకటాచలానికి అత్యంత సన్నిహిత సంబంధాలు ఉండేవన్నారు. రాజశేఖరరెడ్డి చొరవతో జగ్గంపేట నియోజకవర్గంలో పలు అభివృద్ధి చేసినట్టు గుర్తు చేశారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఒబిణ్ని సత్యనారాయణ, జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ గఫూర్, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ రామకుర్తి మూర్తి పాల్గొన్నారు.

### క్రీడాకారులకు టీ షర్ట్‌ల పంపిణీ

కోటనందూరు: మండలంలోని అల్లిపూడి క్రికెట్ క్రీడాకారులకు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు గురువారం టీ షర్ట్‌లు పంపిణీ చేశారు. తునిలో దాడిశెట్టి రాజా ఫెడరేషన్(డీఆర్ఎఫ్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా క్రికెట్ టోర్నమెంటులో పాల్గొనే జట్టును ప్రోత్సహిస్తూ చినబాబు టీ షర్ట్‌లు సమకూర్చారు. వైస్ సర్పంచ్ చింతకాయల చిట్టిబాబు, క్రికెట్ టీమ్ కెప్టెన్ అంకంరెడ్డి సాయి తదితరులు పాల్గొన్నారు.

### తహసీల్దార్‌గా జగదీష్

కోటనందూరు: మండల తహసీల్దార్‌గా ఐ.జగదీష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. తొండంగి మండల తహసీల్దార్‌గా పని చేసిన జగదీష్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా వ్యవహరించిన ఎల్.శివకుమార్ తునికి బదిలీపై వెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన జగదీష్‌ను తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది, వీఆర్వోలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జగదీష్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఆర్ఐ కుమార్, ఏఎస్ఓ వామనమూర్తి, మండల సర్వేయర్ దాలిరాజు తదితరులు పాల్గొన్నారు.

### అంగన్‌వాడీల ఆందోళన

తుని/తుని రూరల్/ప్రత్తిపాడు: తమ న్యాయమైన డిమాండ్లను తీర్చాలని కోరుతూ గురువారం అంగన్‌వాడీలు ఆందోళన చేశారు. తుని అర్బన్, రూరల్, ప్రత్తిపాడు ఐసీడీఎస్ కార్యాలయాల ఎదుట అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ఆందోళన నిర్వహించారు. ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీ మేరకు అంగన్‌వాడీలకు తెలంగాణలో కంటే అధికంగా వేతనాలు ఇవ్వాలన్నారు. పదోన్నతుల్లో రాజకీయ జోక్యాన్ని అరికట్టాలన్నారు. యూనియన్ నాయకులు బి.మేరీసమాదానం, జి.రమణమ్మ, పి.ఇందిరాదేవి, కె.లీలాకుమారి తదితరులు పాల్గొన్నారు.

### గ్రామాల్లో 'సత్యప్రభ' పర్యటన

రౌతులపూడి: టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరుపుల సత్యప్రభ 'పలకరింపు' పేరుతో గురువారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. మండలంలోని ఎస్.పైడిపాల, రాఘవపట్నం, మాతయ్యపేట, సత్యవరం, దబ్బాది, చల్లూరు గ్రామాల్లో పర్యటించి ప్రజలు సమస్యలను తెలుసుకున్నారు. ఆయా గ్రామాల్లో ముఖ్యనాయకులు, కార్యకర్తలను కలసి పార్టీకి అండగా ఉండాలని కోరారు.

# చదువుకు భరోసా... ప్రతిభకు ప్రోత్సాహం

- పేదలకు ఉన్నతవిద్యను అందించడమే లక్ష్యం
- ఎమ్మెల్యేలు జ్యోతుల చంటిబాబు, పర్వత పూర్ణచంద్రప్రసాద్
- టెన్త్, ఇంటర్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సత్కారం


ఏలేశ్వరంలో విద్యార్థిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే పర్వతప్రసాద్


జగ్గంపేటలో విద్యార్థులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

జగ్గంపేట: పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందించాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో గురువారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే చంటిబాబు ముఖ్య అతిథిగా పాల్గొని జగ్గంపేట నియోజకవర్గ పరిధిలో పదో తరగతి, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పాఠశాల హెచ్ఎంలను సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటిబాబు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులను ప్రోత్సహించేందుకే జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. అనంతరం జగ్గంపేట నియోజకవర్గంలో ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులకు రూ.60 వేలు, పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు రూ.30 వేలు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో జగ్గంపేట ఎంపీపీ అత్తులూరి నాగబాబు, గండేపల్లి ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పెద్దాడ రాజబాబు, మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా, గండేపల్లి మండల ఉపాధ్యక్షుడు కుంచే రాజా, ఒబిణ్ని వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

**నగదు బహుమతి అందుకున్న విద్యార్థులు**

పదో తరగతిలో మొదటి బహుమతి నంగన అక్షయ, రెండో బహుమతి పడాల మహేంద్ర, మూడో బహుమతి కరణం హిమబిందు పొందారు. ఇంటర్‌లో ఐ.నిరీక్షణ, సలాది బేబీరాణి, ఎస్.నాగ చైతన్య, ఎం.నాగలక్ష్మి, అత్యధిక మార్కులు సాధించి నగదు బహుమతులు పొందారు.

**ఉత్తమ విద్యను అందించడమే లక్ష్యం**

ఏలేశ్వరం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని నియోజకవర్గవ్యాప్తంగా టెన్త్, ఇంటర్‌లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులను సత్కరించారు. టెన్త్‌లో రౌతులపూడికి చెందిన జిగిరెడ్డి తారక్‌స్వామి, ఏలేశ్వరానికి చెందిన లంక ఉమాదేవి, గెద్ద వైష్ణవి, ఇంటర్‌లో ఏలేశ్వరానికి చెందిన కె.అంజని సూర్యప్రభ, కె.శిరీషాదేవి, పి.రాజేశ్వర్, జి.నాగమణికంఠలతో పాటు వారి తల్లిదండ్రులను సత్కరించారు. విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ అబ్బాయి, ప్రత్తిపాడు ఎంపీడీఓ ఎంబీఆర్ కుమార్‌బాబు, ప్రత్తిపాడు ఎంపీపీ గోళ్ల కాంతికుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, బదిరెడ్డి గోవిందు, నీరుకొండ సత్యనారాయణ, సామంతుల సూర్యకుమార్, చిక్కాల లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

**విద్యతోనే ఉన్నత శిఖరాలు**

శంఖవరం: విద్యతోనే ఉన్నత శిఖరాలకు ఎదగవచ్చని ఎంపీపీ పర్వత రాజబాబు అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో టెన్త్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా గురువారం సత్కరించి నగదు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. పాఠశాల హెచ్ఎం వై.సూర్యనారాయణ, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి, వైస్ సర్పంచ్ చింతనీడి కుమార్, వైఎస్సార్ సీపీ నాయకుడు బుర్ర లచ్చబాబు తదితరులు పాల్గొన్నారు.

**విద్యకు ప్రోత్సాహం**

తుని: విద్యను ప్రభుత్వం పోత్సహిస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. తుని మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఎంఈవో పరవాడ గీతాదేవి అధ్యక్షతన జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. తుని నియోజకవర్గ స్థాయిలో పది, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించారు. పదో తరగతిలో ఎస్.సూరవరం ఉన్నత పాఠశాలకు చెందిన పోతంశెట్టి వెంకట నందిని, తొండంగి మండలం అద్దరిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని జవ్వాదుల కల్యాణి, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ విద్యార్థిని ఆరుగుల మధుశ్రీ, ఎస్.సూరవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన గంగిరెడ్డి భాగ్యశ్రీతో పాటు వారి తల్లిదండ్రులను నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలతో సత్కరించారు. ఇంటర్‌లో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు చెందిన జె.లక్ష్మి ఎంపీసీ, కె.మల్లేశ్వరి హెచ్ఈసీ, ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన ఎస్‌వీఎస్ ఐశ్వర్య బైపీసీ, ఎం.భారతి ఎంఈసీలో అత్యధిక మార్కులు సాధించారు. వీరిని రూ.15 వేలు నగదు బహుమతులు, ప్రశంసా పత్రాలతో సత్కరించారు. తుని, తొండంగి ఎంపీపీలు బొప్పన రాము, అరుణ్ కుమార్, పార్టీ మండలాధ్యక్షుడు పోతల రమణ, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, కౌన్సిలర్లు, సర్పంచులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


శంఖవరంలో విద్యార్థులకు నగదు, సర్టిఫికెట్లు అందజేసిన ఎంపీపీ పర్వత రాజబాబు


తుని మున్సిపల్ కార్యాలయంలో విద్యార్థులను సత్కరిస్తున్న ప్రజా ప్రతినిధులు

## ఖరీఫ్ పంట ప్రణాళికపై అవగాహన


ఖరీఫ్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న వ్యవసాయ శాఖ జేడీ విజయ్‌కుమార్

తుని: ప్రస్తుతం మార్కెట్‌లో అత్యధిక డిమాండ్ ఉన్న చిరుధాన్యాల సాగును ఖరీఫ్‌లో ప్రోత్సహించాలని వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులకు వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ ఎన్.విజయ్‌కుమార్ సూచించారు. తుని చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో గురువారం తుని వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాలకు చెందిన అధికారులకు ఏడీఏ బుల్లిబాబు అధ్యక్షతన ఖరీఫ్ పంట ప్రణాళికపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ మెట్ట ప్రాంతంలో రైతులు చిరు ధాన్యాల సాగు చేపట్టాలన్నారు. బోరు బావుల కింద వరి సాగు తగ్గించి ఆరుతడి పంటలను ప్రోత్సహించాలని ఆదేశించారు. అనంతరం ఖరీఫ్ పంటల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. డీఆర్‌సీ డిప్యూటీ డైరెక్టర్ హరి, డీఆర్‌సీ పెద్దాపురం ఏడీఏ మాధవి, తుని ఏడీఏ బుల్లిబాబు, తుని,తొండంగి, కోటనందూరు, రౌతులపూడి, శంఖవరం మండలాలకు చెందిన వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం

- మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు మల్లిక్
- జగన్నాథపురంలో గడపగడపకూ మన ప్రభుత్వం


జగన్నాథపురంలో మహిళకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న శంకర్‌మల్లిక్

కోటనందూరు: గ్రామాల్లోని ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు శంకర్‌మల్లిక్ అన్నారు. మండంలోని జగన్నాథపురంలో ఎంపీపీ లగుడు శ్రీనివాసు ఆధ్వర్యంలో గురువారం రెండోరోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి శంకర్‌మల్లిక్ ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గత నాలుగేళ్లలో సంక్షేమ పథకాల రూపంలో ప్రతి కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. పథకాలు అందడంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డ్రైన్లు నిర్మించాలని, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని సీసీ రోడ్లు వేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. ఆయా సమస్యలను మంత్రి దాడిశెట్టి రాజా దృష్టికి తీసుకెళ్లి సత్వరమే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ గొర్లి రామచంద్రరావు, లోవదేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, తుని ఏఎంసీ వైస్ చైర్మన్ వెలగా వెంకటకృష్ణాజీ, సర్పంచులు లెక్కల ఉపేంద్ర, సుర్ల రాంబాబు, జిగటాల వీరబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు కొరుప్రోలు కృష్ణ, సుర్ల రాజు, ఉల్లూరి కనకదుర్గ శ్రీను, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, ఈఓపీఆర్డీ అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### మౌనిక కుటుంబానికి మంత్రి రాజా పరామర్శ


బెండపూడిలో మౌనిక కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

తొండంగి: మండలంలోని బెండపూడికి చెందిన మహిళా పోలీస్ మౌనిక ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా ఆమె కుటుంబ సభ్యులను గురువారం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా పరామర్శించారు. బెండపూడిలో మౌనిక భర్త కొరపాటి వెంకటేష్, ఇతర కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీహరి రాజు, కొయ్యా మురళి, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, మద్దుకూరి వీరవెంకట సత్యనారాయణ చౌదరి(పెద్దబ్బు), మద్దుకూరి వెంకటరామయ్యచౌదరి (చిన్నబ్బు), పార్టీ మండల యూత్ కన్వీనర్ ఆరుమిల్లి ఏసుబాబుచౌదరి తదితరులు పాల్గొన్నారు.

### చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్చాలి

ప్రత్తిపాడు: మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తల్లులకు ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి ఏవీఎస్ లక్ష్మి సూచించారు. ప్రత్తిపాడులోని 7వ అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం జనభాగీరదిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తుందని చెప్పారు. జనభాగీరది కార్యక్రమంలోపై ప్రాజెక్టు అధికారిణి ఏవీఎస్ లక్ష్మి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

### ఎంపీడీఓగా రాజేశ్వరరావు బాధ్యతల స్వీకరణ



కిర్లంపూడి: మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీఓ) బడే రాజేశ్వరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా పని చేస్తున్న ఆయన పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, ఉద్యోగుల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

**ప్రత్తిపాడు ఎంపీడీఓగా కుమార్‌బాబు**



ప్రత్తిపాడు: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా ఎంబీఆర్ కుమార్ బాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. రంపచోడవరం ఎంపీడీఓ కార్యాలయ పరిపాలనాధికారిగా పనిచేస్తున్న కుమార్ బాబు పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ ఇన్‌చార్జిగా ఎంపీడీఓగా పని చేసిన ఎస్.వెంకటాచలం పదోన్నతిపై కాట్రేనికోన బదిలీ అయ్యారు. ఎంపీడీఓగా బాధ్యతలు చేపట్టిన కుమార్ బాబుకు ఈఓపీఆర్డీ కేవీవీఎస్ కాశీ విశ్వనాథం, కార్యాలయ సిబ్బంది ఏవీఆర్ సత్యనారాయణమూర్తి, పి.సురేష్‌కుమార్, రత్నం తదితరులు స్వాగతం పలికారు.

### ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష

కోటనందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష సమావేశం జరిగింది. ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ల వ్యక్తిగత పురోగతిపై ఆరా తీశారు. ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేలా లబ్ధిదారులను ప్రోత్సహించాలని సూచించారు. జలజీవన్ మిషన్, నాడు-నేడు, స్వచ్ఛభారత్ పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈఓపీఆర్డీ జి.అరుణ్‌కుమార్, హౌసింగ్ డీఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం


ఏలేశ్వరంలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు


జగ్గంపేటలో సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే చంటిబాబు, కాంట్రాక్ట్ లెక్చరర్లు

ఏలేశ్వరం: కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో పట్టణంలోని కాంట్రాక్ట్ ఉద్యోగులు గురువారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ ఆధ్వర్యంలో స్థానిక బాలాజీ చౌక్ వద్ద కాంట్రాక్టు అధ్యాపకులు, మెడికల్ సిబ్బంది సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే పర్వతను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజేషన్ చేశారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన 99 శాతం హామీలను అమలు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకులు వాగు మాధవ, పలివెల శివాజీ, జానకీరామ్, కనకరాజు, జ్యోతి, శ్రీనుబాబు, మాణిక్యం, వైఎస్సార్ సీపీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, నీరుకొండ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**జగ్గంపేటలో..**

జగ్గంపేట: కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకోవడంపై ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం జగ్గంపేట నియోజకవర్గంలోని కాంట్రాక్టు లెక్చరర్లు జగ్గంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు సమక్షంలో ముఖ్యమంత్రి జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. జై జగన్ అంటూ నినాదాలు చేశారు. 2014 జూన్ నాటికి 5 సంవత్సరాలు సర్వీస్ పూర్తికాని అధ్యాపకలను కూడా క్రమబద్ధీకరణకు అర్హత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబుకు వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబును కాంట్రాక్టు లెక్చరర్లు శాలువా, పూలమాలతో సత్కరించారు. కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెనుమాల రామకృష్ణ, జగ్గంపేట ఎంపీపీ అత్తులూరి నాగబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, సచివాలయాల మండల కన్వీనర్ బండారు రాజా, వైఎస్సార్ సీపీ జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పెద్దాడ రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీకారం


ఏలేశ్వరంలో పెన్షనర్ల భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

ఏలేశ్వరం: మండల వ్యాప్తంగా పలు అభివృద్ధి పనులను గురువారం ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ ప్రారంభించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలోని ఎక్స్‌రే మెషీన్ సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు అన్నిరకాల వసతులు కల్పిస్తున్నామన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఎక్స్‌రే మెషీన్‌ను ఏర్పాటు చేశామన్నారు. అనంతరం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సమీపంలో నిర్మించిన మండల పెన్షనర్స్ సంఘ నూతన భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. సంఘానికి ఎమ్మెల్యే రూ.లక్ష విరాళం ప్రకటించారు. సంఘ నాయకులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంఘ నాయకులు ఇబ్రహీంఖాన్, పొన్నాడ జోగిరాజు, చెన్నాప్రగడ సత్యగాంధీ, ఎం.రాంబాబు, ఉద్దగిరి సోమరాజు తదితరులు పాల్గొన్నారు. తిరుమాలి జగనన్న కాలనీలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, భద్రవరంలో విద్యుత్ స్తంభాలను ఎమ్మెల్యే ప్రారంభించారు.

### పాలవెల్లువ సర్వేను వేగవంతం చేయాలి

రౌతులపూడి: మండలంలో జగనన్న పాలవెల్లువ, వైఎస్సార్ బీమా నమోదు సర్వేలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ ఎం.గోవింద్ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని 17 సచివాలయాల పరిధిలోని కార్యదర్శులు, వెటర్నరీ అసిస్టెంట్, గ్రామ వలంటీర్లు, వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బంది సమష్టిగా పని చేసి సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లోని పాడిరైతులను గుర్తించి వారి వద్ద ఉన్న పశు సంతతిని నమోదు చేయాలని సూచించారు.

## ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు

తుని: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో పట్టణ ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలు అందుబాటులోకి వస్తాయని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్)లో భాగంగా తునికి కేటాయించిన ఎలక్ట్రికల్ వాహనాలను గురువారం ఆమె జెండా ఊపి ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సుధారాణి స్వయంగా ఆటోను నడిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తుని మున్సిపాలిటీకి కేటాయించిన ఎలక్ట్రికల్ వాహనాల్లో తడి-పొడి చెత్తలకు వేర్వేరు డస్ట్‌బిన్లు ఏర్పాటు చేశారన్నారు. ప్రజలు తమ ఇళ్లలోని వ్యర్థాలను తడి-పొడి చెత్తలుగా వేరు చేసి వాహనంలో ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్లలో వేయాలని సూచించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కుసుమంచి సుబ్బరాయులు, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి పాల్గొన్నారు.

### ట్రాఫిక్ నియంత్రణకు ప్రజలు సహకరించాలి

తుని: ప్రస్తుతం విద్యాసంస్థలు తెరవడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తిందని, సమస్య పరిష్కారానికి వ్యాపారులు, ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, పట్టణ సీఐ నాగ దుర్గారావు కోరారు. గురువారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పలు అంశాలను ప్రస్తావించారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో రైతులు, తోపుడు బండ్లు వ్యాపారులు నిబంధనలు పాటించకుండా రోడ్డుపై వ్యాపారం చేస్తున్నారని, దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందన్నారు. ప్రజలకు అసౌకర్యం లేకుండా వ్యాపారం చేసుకోవాలని కోరారు. కొందరు సోషల్ మీడియాలో తప్పుడు కథనాలను ప్రచారం చేస్తున్నారని, ఇటువంటి వారిని ఇప్పటికే గుర్తించామన్నారు. వాస్తవాలను వక్రీకరించి పోస్టులు పెడితే సంబంధిత వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## బాధ్యులపై చర్యలు తీసుకుంటాం

**ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్‌ప్రసాద్**



గోకవరం: మండలంలోని తిరుమలాయపాలెంలో ఎస్సీలపై దాడి సంఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని ఎస్సీ కమిషన్ చైర్మన్ విక్టర్‌ప్రసాద్ అన్నారు. గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు విషయంలో తలెత్తిన వివాదం నేపథ్యంలో గురువారం ఆయన పర్యటించారు. గాయపడిన బోయిడి మహాలక్ష్మి తదితరులను పరామర్శించారు. బాధితుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసిన స్థలాన్ని పరిశీలించి కోరుకొండ సీఐ ఉమామహేశ్వరరావు, తహశీల్దార్ ఎ.శ్రీనివాస్‌లతో మాట్లాడారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇది చాలా విచారకరమైన సంఘటన అన్నారు. బాధితులను చట్టపరంగా ఆదుకోవడానికి చర్యలు తీసుకుంటామన్నారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### ఉచిత దంత వైద్య శిబిరం

కిర్లంపూడి: వీరవరంలో గురువారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. తోట గోపాలకృష్ణ జ్ఞాపకార్థం తోట సర్వారాయుడు ఆధ్వర్యంలో ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. జీఎస్ఎల్ డెంటల్ కాలేజీ నుంచి వచ్చిన 20 మంది డాక్టర్లు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరవరం, పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు 200 మంది రోగులకు దంత వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు గంట సునీల్, హరికృష్ణరాజు పాల్గొన్నారు.

## రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో రోడ్డు నిర్మాణం

జగ్గంపేట: గ్రామ శివారు రంగవల్లి నగర్‌లో ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం సభ్యులు తమ సొంత నిధులు, శ్రమదానంతో రోడ్డు నిర్మాణం చేపట్టారు. సుమారు మూడు దశాబ్దాల క్రితం ఏర్పడిన రంగవల్లి నగర్‌లో మౌలిక వసతులు కల్పనలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ రైతు కూలీసంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి కర్నాకుల వీరాంజినేయులు తెలిపారు. వర్షాకాలంలో మురుగునీరు వెళ్లేందుకు దారిలేక కాలనీ వాసులు అవస్థలు పడుతున్నారన్నారు. సమస్యను ప్రజా ప్రతినిధులకు వివరించినా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టలేదన్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని తమ సంఘం ఆధ్వర్యంలో గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, సహాయ కార్యదర్శి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచి మట్టి నమూనాల సేకరణ

శంఖవరం: భూసార పరీక్షలు చేయించుకోవడం ద్వారా రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ సూచించారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లోనూ శుక్రవారం నుంచి జియో కో ఆర్డినేటర్, క్యూఆర్‌కోడ్ ద్వారా భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలను సేకరిస్తారన్నారు. భూసార పరీక్షలు చేయించుకోవడానికి ఆసక్తి గల రైతులు స్థానిక వ్యవసాయ సహాయకులను సంప్రదించాలని సూచించారు.

### 80 మంది రక్తదానం

తుని: ప్రపంచ రక్తదాన దినోత్సవం సందర్భంగా మమతా హాస్పటల్, మదర్ బ్లడ్ బ్యాంకు సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఉచిత శిబిరం నిర్వహించారు. తుని మమతా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో జెట్టి గ్రానైట్స్ కార్మికులు 80 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేసినట్టు మమతా ఆసుపత్రి సీఈవో వికాస్ తెలిపారు. రక్తదానం చేసిన కార్మికులకు మమతా ఆసుపత్రి ఎండీ జగదీష్ చౌదరి సర్టిఫికెట్లను అందజేశారు. ప్రతిఒక్కనూ రక్తదానం చేయడానికి ముందుకు రావాలని ఆయన కోరారు. జెట్టి గ్రానైట్స్ డైరెక్టర్ శివ సత్యకుమార్, మదర్ బ్లడ్ బ్యాంకు ప్రతినిధి గుప్తా పాల్గొన్నారు.